## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శంషాబాద్ రూరల్, /జనవరి 17: నేడు శంషాబాద్ పట్టణంలోని వివిధ కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ షేక్ బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శంషాబాద్ మున్సిపాలిటీలోని సీఎస్‌కే, రాఘవేంద్రకాలనీ,శ్రీబాలాజీటౌన్ షిప్, రాళ్లగూడ,ప్రకాశ్‌నగర్, యాదవ్‌కాలనీ, ఫోర్టుగ్రాండ్, వెంకటేశ్వరకాలనీ, ఊటుపల్లి,శ్రీనివాస్‌కాలనీతో పాటు ఔటర్‌రింగ్ రోడ్డు లోపలి ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

## ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై ఆర్టీఏ అధికారుల దాడులు

శంషాబాద్ రూరల్, జనవరి 17 : ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న 12 బస్సులపై కేసులు నమోదు చేశామని ఆర్టీఏ అధికారులు తెలిపారు. జిల్లా రవాణాశాఖ అధికారి సదానందం ఆదేశాల మేరకు శుక్రవారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో శంషాబాద్ మండలంలోని తొండుపల్లి ఔటర్‌రింగ్ రోడ్డు టోల్ ప్లాజా వద్ద తనిఖీలు చేయగా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తిరువనంతపురం తదితర ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వస్తున్న పలు బస్సులలో పయర్ సేఫ్టీకిట్టు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఎమర్జెన్సీ డోర్ లేకుండా ప్రయాణిస్తున్న బస్సులపై కేసులు నమోదు చేశామన్నారు. మరోసారి నిబంధనలు పాటించకుండా పట్టుబడితే ఆ బస్సుల పర్మిట్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

## పేకాట శిబిరంపై పోలీసుల దాడి

**-11మంది పేకాటరాయుళ్ల అరెస్ట్**

బంజారాహిల్స్,జనవరి 17: అపార్ట్‌మెంట్‌లో కొనసాగుతున్న పేకాట శిబిరంపై ఫిలింనగర్ పోలీసులు దాడి చేసి 11మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే..మారుతీనగర్‌లోని అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న జి.గంగురాజు(49) అనే వ్యక్తి ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తుంటాడు.
కొంతకాలంగా తన అపార్ట్‌మెంట్‌లో పేకాటశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు గురువారం రాత్రి దాడి చేశారు. నిర్వాహకుడితో పాటు పేకాడుతున్న మరో 10మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.81,180 నగదు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.అనంతరం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

బండ్లగూడ జాగీర్ నుంచి రైతు దీక్షకు బయలుదేరిన బీఆర్ఎస్ శ్రేణులు

దీక్ష ప్రాంగణంలో మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ నాయకులు

# రైతులను దగా చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

### షాబాద్‌లో నిర్వహించిన రైతు దీక్షలో పలువురు నాయకులు

మణికొండ, జనవరి 17: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని దీనిని బీఆర్ఎస్ పార్టీ ఏమాత్రం సహించదని మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సర్కార్ రైతులతో వ్యవహరిస్తున్న మోసపూరిత తీరుకు వ్యతిరేకంగా శుక్రవారం రైతు వ్యతిరేక ధోరణి తలపెట్టిన సర్కారును నిలదీస్తూ బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గంలోని షాబాద్‌లో రైతుల పక్షాన చేస్తున్న దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపారు. అప్పా జంక్షన్ నుంచి, నెక్నాంపూర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణ నుంచి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో కుంభగళ్ల ధనరాజ్, రూపారెడ్డి, గుట్టమీది నరేందర్, అందె లక్ష్మణ్‌రావు, ఉపేంద్రనాథ్‌రెడ్డి, గోరికంటి విఠల్, సంగం శ్రీకాంత్, మాల్యాద్రి నాయుడు, ఆరీఫ్ మొహ్మద్, సుమ నలిని, అన్సు, మంజు, రేఖ, అనూష, గీత, హరి, తిరుపతి, రవిసాగర్, బుద్దోల్ బాబు, దిలీప్, భాను, శ్రీనివాస్‌చారి తదితరులు పాల్గొన్నారు.



రైతు దీక్ష వద్ద కేటీఆర్‌కు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ నాయకుడు రావుల కోళ్ల నాగరాజు తదితరులు

### రైతు దీక్షకు భారీగా తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

బండ్లగూడ: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు రైతులను మోసం చేసినందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ షాబాద్‌లో నిర్వహించిన రైతు దీక్షకు బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు.కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రావుల కోళ్ల నాగరాజు ఆధ్వర్యంలో నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున బయలు దేరి వెళ్లారు.ఈ కార్యక్రమంలో బీజేఎంసీ ప్రధాన కార్యదర్శి రాముడు యాదవ్ స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### రైతులకు అన్యాయం

శంషాబాద్ రూరల్: రైతు దీక్షకు శంషాబాద్ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మంచర్ల మోహన్ రావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. శుక్రవారం శంషాబాద్ మాజీ ఎంపీపీ జయమ్మశ్రీనివాస్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బుర్కుంట సతీష్‌తో పాటు పలువురు మున్సిపాలిటీ, మండలానికి చెందిన నాయకులు శంషాబాద్ నుంచి షాబాద్‌లో నిర్వహించిన దీక్షకు వెళ్లి పాల్గొన్నారు. అంతకు ముందు శంషాబాద్‌లో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదికాలంలోనే రైతులకు అన్ని వర్గాలకు అన్యాయం చేస్తున్నట్లు ఆరోపించారు. ముఖ్యంగా రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా పథకాలను అమలు చేస్తామని అనేక హామీలు ఇచ్చి వాటిని అమలు చేయడంలేదని విమర్శించారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులను చిత్తుచిత్తుగా ఓడిస్తారని స్పష్టం చేశారు. తరలివెళ్లిన వారిలో పార్టీ నాయకులు మంచర్ల శ్రీనివాస్, రాజునాయక్, బాల్‌రాజ్‌గౌడ్, గుంటి చరణ్,సుధాకర్‌గౌడ్, జంగరావు, శ్రీశైలం,మహేష్ యాదవ్‌లతో పాటు పలువురు ఉన్నారు.

శంషాబాద్ నుంచి దీక్షకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

నెక్నాంపూర్ నుంచి రైతు దీక్షకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

### ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చండి

శంషాబాద్ రూరల్, జనవరి 17 : రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గంలోని షాబాద్ పట్టణంలో నిర్వహించిన రైతు దీక్షకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీమంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు శంషాబాద్ మండల పార్టీ తరపున రాష్ట్ర నాయకుడు మంచర్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన ఒక్క హామీని కూడాఅమలు చేయకపోవడమే కాకుండా రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని విమర్శించారు.కేటీఆర్‌కు స్వాగతం పలికిన వారిలో రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి,ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బుర్కుంట సతీష్, లీగల్‌సెల్ అధ్యక్షుడు కొన్నమొల్ల శ్రీనివాస్, రాచమల్ల రమేష్, పలువురు నాయకులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న మంచర్ల శ్రీనివాస్

## రాజ్యాంగాన్ని పూర్తిస్థాయిలో.. అమలు చేయాలి

హిమాయత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో రోహిత్ వేముల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కృష్ణ స్వరూప్

హిమాయత్‌నగర్,జనవరి17: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారత రాజ్యాంగాన్ని పూర్తిస్థాయిల్లో అమలు చేసి దళిత బహుజనులకు సమాన హక్కులు కల్పించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ డిమాండ్ చేశారు.రోహిత్ వేముల 9వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రోహిత్ వేముల చిత్ర పటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు రోహిత్ వేముల చేసిన పోరాటానికి ప్రపంచ వ్యాప్తంగా మంచి స్పందన వచ్చిందని, మనువాద మాఫియా శక్తులు రోహిత్ వేములపై కక్షగట్టి దాడి చేయడంతోనే మృతి చెందాడని ఆరోపించారు.దేశంలోని యూనివర్సిటీలలో ప్రజాస్వామ్యం,లౌకిక,సమతా వాతావరణంను ప్రభుత్వాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.
ఈ కార్యక్రమంలో డీబీఎస్ఎఫ్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఇటికాల గణేష్, రాష్ట్ర సహాయ కో-ఆర్డినేటర్ ఎం. రవీందర్, డీబీఎఫ్ నగర కార్యానిర్వాహక అధ్యక్షుడు సుబ్బా రావు,మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవేందర్, ప్రతినిధి పి.సుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

**క్యాలెండర్ ఆవిష్కరణ:** *గగన్‌పహాడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ యూనియన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఖైరతాబాద్‌లోని జీఐఎస్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి యూనియన్ నాయకులు సాయిలు ముఖ్య అతిథిగా హాజరై యూనియన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కిరణ్, మానయ్య, శ్రీనివాస్, రాములు, నీతారామ్, సైదులు, కృష్ణ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.*
*– మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 17:*

### కాలనీల అభివృద్ధికి తోడ్పాటు

మియాపూర్ : కాలనీల అభివృద్ధికి తోడ్పాటునందిస్తానని మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో ఓంకార్ నగర్ బస్తీ వాసులు కలిసి వినతిపత్రం సమర్పించారు. తాగునీటి వసతిని మెరుగు పరుస్తానని చివరి గృహం వరకు లభ్యత సమకూరేలా అధికారులతో సమన్వయం చేస్తానన్నారు.

## స్వావలంబి భారత్ అభియాన్‌తో.. యువతకు ప్రోత్సాహం

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రమేశ్ గౌడ్, ఇంద్రసేన్ రెడ్డి, రచ్చ శ్రీనివాస్

ఖైరతాబాద్, జనవరి 17 : స్వావలంబి భారత్ అభియాన్ పథకం ద్వారా యువతకు తగిన ప్రోత్సాహం అందిస్తామని ఆ విభాగం కన్వీనర్ రమేశ్‌గౌడ్ తెలిపారు. సోమాజిగూడలోని స్వావలంబి భారత్ అభియాన్ కార్యాలయంలో శుక్రవారం లోన్ మేళా పోస్టర్లను కో కన్వీనర్ ఇంద్రసేన్ రెడ్డి, స్వదేశీ జాగరణ ప్రాంత సంఘటన్ ప్రతినిధి రచ్చ శ్రీనివాస్,సిద్ధుల అశోక్, సుధాకర్ శర్మతో కలిసి ఆవిష్కరించారు. రమేశ్ గౌడ్ మాట్లాడుతూ జీహెచ్ఎంసీ పరిధిలోని తయారీ, వర్తక రంగాల్లో, చిరు వ్యాపారాలు చేసుకునే ఔత్సాహిక యువతకు ప్రోత్సాహం అందించేందుకు లోన్ మేళా కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో ముద్ర లోన్ సంబంధించిన శిశు పథకంలో రూ.50వేలు, కిశోర్ పథకం ద్వారా రూ. 50,001 నుంచి రూ.5లక్షల వరకు, తరుణ్ పథకం ద్వారా రూ.5లక్షల నుంచి రూ.10లక్షల వరకు, స్టార్టప్ ఇండియాతో రూ.50లక్షల వరకు రుణాలు అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి. స్వప్న, కేశవ్ సోని తదితరులు పాల్గొన్నారు.

## అక్రమనిర్మాణాలపై చర్యలు శూన్యం

దూలపల్లి సెయింట్ మార్టిన్ వెనకాల అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భాలిషెడ్డు

కుత్బుల్లాపూర్ : కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి. మున్సిపాలిటీ నుంచి అనుమతులు లేకుండా నిర్వాహకులు నిర్మాణాలు చేపట్టడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దూలపల్లి సెయింట్ మార్టిన్ వెనకాల కొందరు భారీషెడ్డు నిర్మాణాలు చేపడుతున్నారు. స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు. అధికారులు అటువైపునకు కన్నెత్తి చూడకపోవడంపై వారి పని తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేకుండా సాగుతున్న పలు షెడ్డు నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకోవాలంటూ స్థానికులు కోరుతున్నారు.

## ఊరెళ్లి వచ్చేసరికి ఇంట్లో చోరీ

బంజారాహిల్స్, జనవరి 17: సంక్రాంతి పండుగకు ఊరెళ్లి తిరిగి వచ్చేసరికి ఇంట్లో చోరీ అయిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. ఫిలింనగర్‌లోని దుర్గాభవానీనగర్ బస్తీలో నివాసం ఉంటున్న జి.రాధిక ఈనెల 11న ఇంటికి తాళం వేసి సంక్రాంతికి మహబూబాబాద్ జిల్లాలోని సొంతూరుకు వెళ్లింది. పండుగ పూర్తయిన తర్వాత తిరిగి ఇంటికి వచ్చి చూడగా.. తలుపులు పగులగొట్టి కనిపించాయి. దీంతో లోనికి వెళ్లి అల్మారాలో చూడగా.. రెండు బంగారు గొలుసులు, 6 ఉంగరాలు, 6 జతల చెవి రింగులతోపాటు కొన్ని వెండి వస్తువులు మాయమైనట్లు తేలింది. బాధితురాలు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## 'ఎర్రకుంట'ను కాపాడాలి

**కలెక్టరేట్ కార్యాలయంలో ఫిర్యాదు**

బండ్లగూడ,జనవరి 17: గండిపేట మండలం పరిధిలోని కిస్మత్ గ్రామంలో ఉన్న ఎర్రకుంట స్థలాన్ని కాపాడాలని కాంగ్రెస్ నాయకుడు మన్నె మోహన్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ కిస్మత్‌పూర్ గ్రామంలోని సర్వే నెంబర్ 161లో గల 15 ఎకరాల 16 గుంటల స్థలంలో ఎర్రకుంట ఉంది.కాగా ఈ కుంటను సుందరీకరణ పేరుతో స్థానిక నాయకులు అధికారులతో కలిసి సుమారు రెండు ఎకరాల స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన వాపోయారు.ప్రస్తుతం సుందరీకరణ పేరుతో ఉన్న ఎర్ర కుంటను నాశనం చేసి కుంటలోకి వచ్చే నీటి కాలువలను మూసి వేసేందుకు పనులు చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశామన్నారు.

## వర్సిటీ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

కేపీహెచ్‌బీ కాలనీ : జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి వైస్ చాన్స్‌లర్ వి.బాలకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం వర్సిటీలో నిర్వహించిన క్యాంపస్ క్లీన్ కార్యక్రమాన్ని వైస్ చాన్స్‌లర్, రెక్టార్ విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు ప్రారంభించారు. వైస్ చాన్స్‌లర్ బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. వర్సిటీ అవరణలోని క్లాస్‌రూంలు, హాస్టల్స్, లైబ్రరీలు, ఇతర ప్రాంతాలను విద్యార్థులు బాధ్యత తీసుకొని శుభ్రంగా ఉంచాలని సూచించారు. వర్సిటీలో పరిశుభ్రతకు తరుచుగా క్యాంపస్ క్లీన్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, విద్యార్థులు భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డైరెక్టర్లు, బోధన, బోధనేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 'హెల్మెట్ లేకుండా.. వాహనాలు నడపొద్దు

**-ప్రతిజ్ఞ చేసిన వాహనదారులు -వినూత్నంగా అవగాహన కల్పించిన ట్రాఫిక్ పోలీసులు**

బంజారాహిల్స్, జనవరి 17: జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులను గుర్తించేందుకు ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు వినూత్న రీతిలో అవగాహన కల్పించారు. శుక్రవారం జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 36లో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా హెల్మెట్ లేకుండా పట్టుబడిన వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. 'హెల్మెట్ లేకుండా మరోసారి వాహనాలు నడపబోమని.. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని, ప్రమాదాల్లో ప్రాణాలు పోగొట్టుకోకుండా కుటుంబం పట్ల బాధ్యతగా వ్యవహరిస్తామంటూ.' వాహనదారుల చేత జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ ప్రతిజ్ఞ చేయించారు. రోడ్డు భద్రత బాధ్యత కేవలం పోలీసులదే కాదని, రోడ్డుమీదకు వచ్చే ప్రతివాహనదారుడు బాధ్యతగా ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందేవారిలో అత్యధికంగా హెల్మెట్ ధరించని వారే ఉంటున్నారని, ఇదే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ గోపి తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో హెల్మెట్ ధరించని వారి చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్

మాదాపూర్‌లోని శిల్పారామంలో కొనసాగుతున్న గాంధీ శిల్పబజార్ మేళాలో భాగంగా శుక్రవారం సాయంత్రం నృత్యకారుల సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో నేహా సింగ్ శిష్యబృందం జానపద నృత్యాలతో అలరించారు. కోలాటం, బిహు, లంబాడి, ఓయిలాట్టం, ఉత్తరాఖండ్ జానపద నృత్యం, సంబల్పూరి, భాంగ్రా, కావడి చిందు అంశాలు ప్రదర్శించారు. - కొండాపూర్

### ఎస్సీ డీడీ కమిషనర్‌గా .. ఎస్సీ కార్పొరేషన్ ఎండీ క్షితిజ

జూబ్లీహిల్స్,జనవరి17: తెలంగాణ షెడ్యూల్డ్ క్యాస్ట్స్ కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (ఐఎఫ్ఎస్) ఎన్.క్షితిజ తెలంగాణ వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కమిషనర్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్సీ కార్పొరేషన్ ఎండీగా 2024 నవంబర్ 2 న బాధ్యతలు చేపట్టిన ఆమెను తెలంగాణ షెడ్యూల్డ్ క్యాస్ట్స్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ కమిషనర్ (ఎఫ్ఏసీ) గా నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు మాసబ్‌ట్యాంక్‌లోని ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యాలయంలో ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్ ఆదేశాలతో ఎస్సీడీడీ కమిషనర్‌గా ఆమె అదనపు బాధ్యతలు స్వీకరించారు.

### ఎమ్మెల్యే ఆదేశాలతో ప్యాచ్‌వర్క్స్

కవాడిగూడ, జనవరి 17: ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆదేశాల మేరకు శుక్రవారం బాపూజీనగర్‌లో జీహెచ్ఎంసీ అధికారులు సీసీరోడ్డు ప్యాచ్‌వర్క్ నిర్మాణ పనులను చేపట్టారు.

# సీపీఆర్ పై ఉచిత శిక్షణ

- 25 ఏండ్లుగా శిక్షణ ఇస్తున్న గాంధీ వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం
- ఈనెల 19 నుంచి 20 వరకు నిర్వహణ
- అనంతరం సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్న అధికారులు

బన్సీలాల్‌పేట్, జనవరి 17: గుండెపోటు వచ్చిన సమయంలో ప్రాణాలను కాపాడే సీపీఆర్ (కార్డియో పల్మనరీ రెసిస్టేషన్) చేసే పద్ధతిపై సాధారణ పౌరులందరికీ ఉచిత శిక్షణ ఇస్తున్నామని గాంధీ మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు తెలిపారు. గాంధీ మెడికల్ కాలేజీ ఆలుమ్ని అసోసియేషన్, జీఎంసీ గ్లోబల్ అలయెన్స్, అమెరికన్ హార్ట్ అసోసియేషన్, జనహిత సేవా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో జనవరి 19, 20, 21వ తేదీల్లో గాంధీ దవాఖాన ఆవరణలోని అలుమ్ని భవనంలో ఉచిత శిక్షణ శిబిరం ఏర్పాటు చేశామని వారు పేర్కొన్నారు. గాంధీ మెడికల్ కాలేజీ అలుమ్ని అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జీఆర్ లింగమూర్తి, డాక్టర్ రవీందర్ సురకంటి, డాక్టర్ మహేశ్వర్ పర్వత్‌రెడ్డి, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ డెన్నిస్ మెకాలే (చికాగో), జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధి నర్సింహమూర్తి మీడియాతో మాట్లాడారు. 2000 ఏడాది నుంచి ఇప్పటి వరకు 30 వేల మంది డాక్టర్లకు ఉచిత శిక్షణ ఇచ్చామని, 2018 నుంచి సాధారణ ప్రజల కోసం కమ్యూనిటీ సీపీఆర్ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. రాబోయే మూడు రోజుల్లో ఐదు వేల మందికి శిక్షణ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. శిక్షణకు హాజరైన వారికి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఆసక్తి గలవారు 81797 13704, 90631 82058లలో రిజిస్టర్ చేసుకొని, లేదా నేరుగా కూడా ఉచిత శిక్షణకు హాజరుకావొచ్చని వారు వివరించారు.

సీపీఆర్ గురించి వివరిస్తున్న జీఎంసీ అలుమ్ని ప్రతినిధులు